క్లుప్తంగా

ఘనంగా బ్రహ్మోత్సవాలు



ముస్తాబాద్: గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రసిద్ధ శ్రీహరిహర బ్రహ్మోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం హోమం, బలిహరణం నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం జరిగే రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.

‘పది’ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభం



ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

ఇల్లంతకుంట: పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. మండలంలో 11 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, బాలికల గురుకుల పాఠశాల, మోడల్ స్కూళ్లు, వీటిలో 440 మంది బాలబాలికలు పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ప్రత్యేక తరగతులు జనవరి 9వరకు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శివపార్వతుల కల్యాణం



తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని శ్రీ శివలింగ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో మంగళవారం శివ పార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్ కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట: జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న గడ్డం నగేశ్‌ను మండల బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పలు సమస్యలను విన్నవించారు. రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరస కృష్ణహరి, మాజీ ఏఎంసీ చైర్మన్లు గుల్లపల్లి నరసింహారెడ్డి, కుంబాల మల్లారెడ్డి, నాయకులు దేవదాస్, బాలకిషన్, భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

మరమ్మతు పనులు పరిశీలన

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో వీరసముద్రం మత్తడి మరమ్మతు పనులను క్వాలిటీ కంట్రోల్ ఈఈ ప్రవీణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. నీటి పారుదలశాఖలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు ఈఈ తెలిపారు. వీరసముద్రం మత్తడి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. డీఈలు శరత్, రవికుమార్, ఏఈలు శ్రీనివాస్, ప్రవీణ్, నవీన్ తదితరులున్నారు.

సీజనల్ పండ్లతో ఆరోగ్యం

ఎల్లారెడ్డిపేట: సీజనల్ పండ్లు తింటే ఆరోగ్యంగా ఉండవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి అన్నారు. పదిర అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించా రు. కార్యక్రమంలోఅంగన్‌వాడీ టీచర్ సుమలత, పద్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

తంగళ్లపల్లి: పోలీస్ కానిస్టేబుల్ అప్రమత్తతో యువకుడి ప్రాణాలు నిలిచిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన వనం మహేశ్ (24) ఇంట్లో గొడవలతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. తాను చనిపోతున్నట్లు తల్లి వెంకటమ్మకు ఫోన్‌చేయగా వెంటనే ఆమె డయల్ 100కు కాల్ చేసి తన కొడుకును రక్షించాలని కోరింది. స్పందించిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ జవ్వాజి ప్రశాంత్ మహేశ్ ఫోన్ నంబర్ లొకేషన్ ట్రేస్ చేసి లక్ష్మీపూర్ రోడ్డులోని ఓపెన్ ప్లాట్లలో అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి ఆసుపత్రికి తరలించాడు. యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ ప్రశాంత్‌ను పలువురు అభినందించారు.

గుంతలరోడ్లతో నరకప్రాయం

- మండలంలో అధ్వానంగా రోడ్లు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి



ఈ చిత్రంలో కనిపిస్తున్న రోడ్డు మండలంలోని దేవునిగుట్ట తండా నుంచి బాకూరుపల్లి తండాకు వెళ్లేరోడ్డు. గుంతలతో ప్రమాదకరంగా తయారైంది. వర్షాకాలంలో రోడ్డువెంట ప్రయాణం ఇబ్బందిగా మారిందని వాహనదారులు తెలుపుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



ఈచిత్రంలోనిది ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం శివారులోని రాపెల్లివాగు వంతెన వద్ద గుంతల రోడ్డు. గుంతల్లో వర్షపునీరు నిలిచి ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. వాహనాలు దెబ్బతింటున్నాయి. ఆటోడ్రైవర్లు, ప్రయాణికులు నొప్పులతో బాధపడుతుండటంతో పాటు వాహనాలు మరమ్మతులు చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒక్క రాపెల్లివాగు వంతెన వద్దనే కాకుండా మండలవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితులు ఇలాగే ఉన్నాయి.

ఎల్లారెడ్డిపేట: మండలంలో రహదారులు అడుగుకో గుంతగా తయారయ్యాయి. దీంతో ఈ రోడ్లపై వాహనదారులకు ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అటు వాహనదారులు, ఇటు ప్రయాణికులు వెన్నుపూస సమస్య, ఇతర సమస్యలతో బాధపడుతున్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల రోడ్లు గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. వివిధ రూట్లలో సుమారు 12 రోడ్లు భారీ గుంతలతో భయంకరంగా కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతల్లో నీరు నిలిచి లోతు తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు తెలిపినా కనీసం మరమ్మతు చేయడం లేదని పలువురు వాపోతున్నారు.

నడుం నొప్పులతో ఆస్పత్రులకు..

గుంతలరోడ్లపై ప్రయాణాలు చేసే వారిలో 75 శాతం మంది వివిధ రకాల నడుం నొప్పులతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఆటో డ్రైవర్లు మొదలుకొని ప్రయాణికులు సైతం గుంతలరోడ్లతో ఇబ్బంది పడుతున్నారు. ఒక్క నడుం నొప్పికాకుండా, వెన్నుపూస కదలడం, డిస్క్, పక్కటెముకలు, మోకాళ్లు, మెడలు పట్టుకోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని రోడ్లు గుంతలతో అధ్వానంగా మారాయి. రోడ్ల దుస్థితిపై గ్రామాల ప్రజలు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లను సైతం పరిశీలించడం లేదన్న ఆరోపణలున్నాయి. తాత్కాలికంగా మరమ్మతులు చేసే అవకాశాలున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గుంతలరోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డిస్క్ ప్రాబ్లమ్స్ వస్తున్నాయి



తరచూ ఈ రోడ్ల గుండా ప్రయాణించేవారిలో డిస్క్ ప్రాబ్లమ్స్ వస్తున్నాయి. మా ఊరికి రోడ్డు అడుగో గుంతగా తయారైంది. పలుసార్లు రోడ్డు మరమ్మతు చేయాలని అధికారులకు విన్నవించాం. నిధుల కారణంగా మరమ్మతు పనులు చేయడం లేదు. రోడ్డుపై వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. అధికారులు మరమ్మతు పనులు చేపట్టాలి.

– గొరిటిపల్లి జితేందర్, బండలింగంపల్లి

‘మంత్రి పొన్నం క్షమాపణ చెప్పాలి’



సిరిసిల అర్బన్ : నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే క్షమాపణ చెప్పాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కానపురం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై మంత్రి పొన్నం అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. 24 గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పకుంటే జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన, దిష్టి బొమ్మలు దహనం చేసే కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

చందుర్తి: మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీసీ, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాదిగలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దళితులకు డబ్బులు, పదవుల కన్నా ఆత్మగౌరవం ముఖ్యమని, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సహచర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కించేపర్చే విధంగా మాట్లాడడాన్ని ఖండించారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పకపోతే అన్ని మండలకేంద్రాల్లో పొన్నం దిష్టి బొమ్మను దహనం చేసి, కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తర్రే శంకరయ్య, ఉపాధ్యక్షుడు లింగంపల్లి అర్జున్, అంబేద్కర్ సంఘాల డివిజన్ అధ్యక్షులు దుమ్ము ఆనంద్, మండల కార్యవర్గ సభ్యులు లింగంపల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల ట్యాక్స్ చెల్లించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి, సిబ్బంది

చందుర్తి: కమర్షియల్ వాహనాల ట్యాక్స్ వెంటనే చెల్లించాలని జిల్లా మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీధర్ అన్నారు. మంగళవారం చందుర్తి, రుద్రంగి మండలాల పరిధిలో తనిఖీలు చేపట్టి నాలుగు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ వాహన యజమాని ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్‌ను వెంట ఉంచుకోవాలన్నారు. కమర్షియల్ వాహనాలు ట్యాక్స్ చెల్లించకుంటే సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట అధికారి పృథ్వీరాజ్‌వర్మ, కానిస్టేబుల్ ప్రశాంత్ ఉన్నారు.

వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలి



బోయినపల్లి: వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని మోటారు వాహనాల సహాయక తనిఖీ అధికారి రజనీదేవి పేర్కొన్నారు. మండలంలోని కొదురుపాక, బోయినపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని నాలుగు వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రయాణికులను పరిమితికి మించి తీసుకెళ్లొద్దన్నారు. ఇసుక రవాణా ట్రాక్టర్ల పత్రాలు పరిశీలించారు. రవాణాకు సంబంధించిన వాహనాలు అధికలోడు తీసుకువెళ్లద్దని, వాహన యజమానులకు సూచించారు. తనిఖీల్లో బోయినపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలి



సారంపల్లిలో సమావేశమైన నాయకులు, కార్యకర్తలు

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీటీసీ స్థానాల గ్రామాలవారీగా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండెపల్లి, రాళ్లపేట, సారంపల్లి గ్రామాల్లో సమావేశాలను ఏర్పాటుచేశారు. టోని మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు అందరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు యోగా విద్యార్థులు



పోటీలకు బయల్దేరిన జిల్లా విద్యార్థులు

సిరిసిల్లటౌన్: మైసూర్‌లో జరిగే 50వ జాతీయ స్థాయి పోటీలకు యోగా విద్యార్థులు మంగళవారం ప్రయాణమయ్యారు. ఈనెల 8 నుంచి 15 వరకు కర్ణాటకలోని మైసూర్‌లో పోటీలు జరగనున్నాయి. జిల్లా నుంచి సీనియర్స్ విభాగంలో పసుపుల ప్రణయ్, గోక వినోద్‌కుమార్, ఓరగంటి రామకృష్ణ తదితరులు పాల్గొంటున్నారు. వీరిని జిల్లా యువజన క్రీడల విభాగం అధికారి రాందాసు, యోగా శిక్షకులు ఉప్పల శ్రీనివాస్, యోగ సాధకులు బొర్ర అశోక్, లావణ్య, పారేలి దేవయ్య, కనకయ్య, గద్దె శ్రీదేవి, తిరుపతి అభినందించారు.

రాష్ట్రస్థాయి టీఎల్‌ఎం మేళాకు ఎంపిక

చందుర్తి: సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళాలో సనుగుల ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆంగ్లభాష నందు జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతికి సిహెచ్.హరీష్మాను ఎంపికచేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించినట్లు ప్రధానోపాధ్యాయుడు కట్కూరి ముఖేష్ తెలిపారు. డీఈవో వినోద్, డిప్యూటీ డీఈవో లక్ష్మీరాజం, మండల ఉపాధ్యాయులు కోరెపు శ్రీనివాస్, గడప రఘుపతిరావు, కాపిల్ల నరేశ్, కుమారస్వామి, ఆకుల రజిత, అన్నాడి రజిత, తదితరులు పాల్గొన్నారు

ఎంఈవోకు సన్మానం

కోనరావుపేట: మండల విద్యాధికారిగా పనిచేస్తున్న మురళినాయక్‌కు డాక్టరేట్ రావడంతో ధర్మారం ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య

సిరిసిల్ల అర్బన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని జిల్లా అంబేద్కర్ సంఘాల అధ్యక్షుడు కత్తెర దేవదాస్, సిరిసిల్ల దళిత సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బాధ్యుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పర్శరాములు, నక్క నర్సయ్య, రాములు, సెస్ డైరెక్టర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై న్యాయవాది కిశోర్ దాడిని ఖండిస్తూ మండలకేంద్రంలోన్యాయవాదులు, నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఏజీపీ పసుల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గుండాడి రాంరెడ్డి, షేక్ గౌస్, ఏలూరి రాజయ్య, కొండాపురం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు హుండీ ఆదాయం లెక్కింపు

సిరిసిల్లటౌన్: శ్రీశాల వెంకన్న ఆలయ హుండీని ఈనెల 9న లెక్కిస్తున్నట్లు ఆలయ ఈవో మారుతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి హుండీ లెక్కింపు ఉంటుందని పట్టణ ప్రజలు గమనించాలని కోరారు.

క్రీడా దుస్తులు పంపిణీ

కోనరావుపేట: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదివి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దండు సంజయ్ జ్ఞాపకార్థం పదో తరగతి మిత్రులు పాఠశాల విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు.బీఆర్‌ఎస్ యువజన సంఘంనాయకులు చిట్నేని శివతేజ రావు మాట్లాడారు. పూర్వ విద్యార్థులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాంగ్రెస్ చేసిన అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న గోపాల్‌రావు

ముస్తాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజలు వాస్తవాలను గమనించారని, జెడ్పీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లకు ఇంకా ఏర్పాట్లు చేయలేదన్నారు. సమావేశంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, చెవుల మల్లేశ్, భరత్, స్వామి, పల్లెసత్యం, జహంగీర్, కోడె శ్రీను, రామచంద్రం తదితరులున్నారు.

ఆరోగ్యంపై దృష్టిసారించాలి

వేములవాడ: ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ చీకోటి సంతోష్, కొలిపాక నర్సయ్య, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ నాగమల్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలోని వాకింగ్ ట్రాక్ వద్ద వాకర్స్‌కు పలు అంశాలపై అవగాహన కల్పించారు.



ముస్తాబాద్: మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రానికి కాంపౌండ్ వాల్ లేదు. దీంతో కేంద్రం ఆవరణకు రక్షణ లేకుండా పోయింది. పశువులు సంచరించడంతోపాటు ఆట వస్తువులకు రక్షణ లేదు. భవనం నిర్మించిన అధికారులు కాంపౌండ్ కూడా నిర్మించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
ఉమారాణి, సీడీపీవో సెల్:9494868422

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఆటోడ్రైవర్లు ఆగం కావొద్దు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న కేటీఆర్

ఎల్లారెడ్డిపేట: ఆటోడ్రైవర్లు మనోధైర్యం కోల్పోవద్దని.. రెండేళ్లలో మంచి రోజుల వస్తాయని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఆటో నడవక, అప్పులపాలై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వీర్నపల్లి మండలం అడవిపదిరకు చెందిన నాంపల్లి సతీశ్ ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంగళవారం కేటీఆర్ పరామర్శించారు. సతీశ్ కుటుంబానికి వ్యక్తిగతంగా రూ.25వేలు ఆర్థికసాయం అందించారు. అనంతరం అక్కడే ఉన్న ఆటోడ్రైవర్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ధైర్యం కోల్పోవద్దని ఆటోడ్రైవర్లను కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆటోడ్రైవర్ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తమ ప్రభుత్వం గతంలో డ్రైవర్ల కోసం తీసుకొచ్చిన ప్రమాదబీమాను కాంగ్రెస్ ప్రభుత్వం తీసివేసిందని ఆరోపించారు. పార్టీలకతీతంగా ఆటోడ్రైవర్లు కలిసి రావాలని కోరారు. ప్రభుత్వం మెడలు వంచైనా ఇచ్చిన హామీలను అమలు చేసుకుందామన్నారు. కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ మండలాధ్యక్షులు వరస కృష్ణహరి, గుజ్జుల రాజిరెడ్డి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, నాయకులు అందె సుభాష్, కొండ రమేశ్, గుల్లపల్లి నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, సురేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

వివాహానికి రండి

తంగళ్లపల్లి: మండలానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆవునూరి వెంకటరాములు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేటీఆర్‌ను కలిసిన వెంకటరాములు తన కూతురు వివాహానికి హాజరుకావాలని కోరారు. మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, జిల్లా మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, మాజీ ఎంపీటీసీ శ్యాగ దేవేందర్ తదితరులున్నారు.

మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ..

సిరిసిల్ల అర్బన్ : పట్టణ పరిధిలోని చంద్రంపేట 12వ వార్డు మాజీ కౌన్సిలర్ రాజిరెడ్డి అరికాలుకు పొలం వద్ద కొయ్య గుచ్చి ఇన్ఫెక్షన్ కావడంతో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నాడు. మంగళవారం సిరిసిల్లకు వచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చంద్రంపేటలోని రాజిరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, వీరగోని శ్రీనివాస్‌గౌడ్, మాట్ల మధు, పడిగెల రాజు, రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల నిరసన



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



వేములవాడలో..

సిరిసిల్లకల్చరల్/వేములవాడ: దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పట్ల అమానుషంగా ప్రవర్తించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ బాధ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం కోర్టు విధులు బహిష్కరించి ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా అధ్యక్షులు జూపెల్లి శ్రీనివాసరావు, గుడిసె సదానందం మాట్లాడుతూ, సీజేఐకి జరిగిన అవమానం దేశ ప్రజలకు, రాజ్యాంగానికి జరిగిన అవమానంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఆయా అసోసియేషన్‌ల ప్రతినిధులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



ముస్తాబాద్: మండలకేంద్రంలోని శ్రీశివకేశవుల నామస్మరణతో మార్మోగింది. ముస్తాబాద్‌లోని ప్రసిద్ధ శ్రీ శివకేశవుల ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మొదట రథంపై శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులు ఉండగా భక్తులు దర్శించుకున్నారు. మరో రథంపై శ్రీ ఉమామహేశ్వరుల ఉత్సవ మూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. దారి వెంట భక్తులు కోలాటం, భజనలతో శివకేశవుల నామస్మరణతో రథాలు లాగారు. ఆలయ కమిటీ చైర్మన్ మిడిదొడ్డి శెరయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ జెడ్పీటీసీ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుమతి, నల్ల నర్సయ్య, కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ టికెట్ కేటాయించాలి

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాసాగర్ మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిశారు. రేపాక ఎంపీటీసీ స్థానం తనకు కేటాయించాలని వినతిపత్రం అందించారు. రాజిరెడ్డి, భరత్, గూడ బా బు, శ్రీనివాస్, ఎండీపాషా, తదితరులున్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

వీర్నపల్లి: మండలంలోని శాంతినగర్ గ్రామంలోకి కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన హిరమండి, పాపియా వచ్చి అడవిని చదును చేసేందుకు యత్నించారు. వారిని ఎస్సై వేముల లక్ష్మణ్ తహసీల్దార్ ముక్తార్ పాషా ఎదుట మంగళవారం బైండోవర్ చేశారు.

పాఠశాల తనిఖీ

ఇల్లంతకుంట: మండలంలోని తాళ్లపల్లి, రేపాక, సోమారంపేట, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల హాజరుపట్టిక, పాఠశాల రికార్డ్స్, మధ్యాహ్న భోజనం, పరిశీలించారు.